క్లుప్తంగా

ఎమ్మెల్సీ పరామర్శ



కేశవరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ రామారావు

సోంపేట: మామిడి పల్లి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త గొరకల లింగరాజు తండ్రి కేశవరావు ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు మృతుని కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించి సంతాపం తెలియజేశారు. సర్పంచ్ పాతిన శేషగిరి, ఎంపీటీసీ దున్న మాధవరావు, పార్టీ నాయకులు గేదెల కేశవరావు, జయరాం, శివరాం ఉన్నారు.

ఆటో కార్మికులకు అండగా ఉంటాం



మాట్లాడుతున్న వామనమూర్తి

ఇచ్ఛాపురం: ఆటో కార్మికులకు అండగా ఉండి కార్మిక సమస్యలపై ప్రభుత్వంతో పోరాటం చేస్తామని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వామనమూర్తి అన్నారు. పట్టణంలోని ఆటో యూనియన్ కార్యాలయంలో ఆదివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆటో ఫిట్‌నెస్ పరీక్ష కోసం 139 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎచ్చెర్ల వెళ్లాలనే ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. చట్టం ప్రకారం 66 కిలోమీటర్లలోపే ఆటోలకు ఫిట్‌నెస్‌లు సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎప్పటివలే ఇచ్ఛాపురంలోనే ఫిట్‌నెస్ పరీక్షలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆటో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు బి.మోహన్‌రెడ్డి, హరి, ఉలాసి ఎర్రయ్య, తిరుపతి పాల్గొన్నారు.

భూ సమస్యను పరిష్కరించాలి



నిరసన ప్రదర్శనలో రైతులు

సోంపేట: కొర్లాం గ్రామ రెవెన్యూ పరిధిలోని అగ్రహారంలో నెలకున్న భూమి సమస్యను పరిష్కరించాలని పలువురు రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కొర్లాం సచివాలయం వద్ద ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ.. తమ పూర్వీకులు అగ్రహారం భూములు కొనుగోలు చేశారన్నారు. రీసర్వేలో అగ్రహారం పరిధిలోని 250 ఎకరాల భూములు భువనేశ్వర పాడికి చెందినవనిగా గుర్తించడంతో ఆందోళన చెందుతున్నామన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

చెత్త సేకరణకు చర్యలు



పుష్ గార్డులను పరిశీలిస్తున్న కమిషనర్ రామారావు

సాక్షి ఎఫెక్ట్...

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఎక్కడి చెత్త అక్కడే పేరుకుపోతుంది. ఇంటి నుంచి చెత్త సేకరణ సక్రమంగా జరగకపోవడంతో చాలా మంది కాలువల్లో చెత్తచెదారాలను పడేస్తున్నారు. ఈ సమస్యపై 'సాక్షి'లో పలుమార్లు కథనాలు వచ్చాయి. ఎట్టకేలకు మున్సిపల్ అధికారులు స్పందించారు. అలాగే ఇదే సమస్యను ఇటీవల జరిగిన మున్సిపల్ సర్వసభ్య సమావేశంలో కౌన్సిలర్లు సైతం ప్రస్తావించారు. దీంతో సభ్యుల ఆమోదంతో మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావు చెత్త సేకరణ కోసం పుష్‌గార్డులను తయారీ చేయించారు. త్వరలోనే వీటి ద్వారా ఇంటింటికీ పారిశుద్ధ్య కార్మికులు వెళ్లి చెత్తను సేకరించనున్నారు.

'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'పై ప్రచారం



జంట పట్టణాలలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఈ నెల తొమ్మిదో తేదీన నిర్వహించనున్న బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమంపై వైఎస్సార్‌సీపీ శ్రేణులు ఆదివారం వార్డులలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు ఆధ్వర్యంలో జరగనున్న కార్యక్రమానికి పార్టీ ప్రముఖులు ధర్మాన కృష్ణదాస్, తమ్మినేని సీతారాం, కుంభా రవిబాబు విచ్చేయనున్నారు. కాశీబుగ్గ పాతజాతీయ రహదారిపై ఉన్నటువంటి టీకేఆర్ కళ్యాణ మండపంలో జరగనున్న కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ప్రచారంలో పార్టీ పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి, నాయకులు బోర క్రిష్టారావు, బడగల బల్లయ్యనాయుడు, బోర చంద్రకళ, బోర భగవతి, జోగి సతీష్, పోతనపల్లి హరిప్రసాద్, బమ్మిడి సంతోష్, వల్లభ వైకుంఠరావు, బిరాటి వల్లభ, నర్తు వెంకటరమణ ఉన్నారు.

కొనలేం.. తినలేం..!

- అమాంతం పెరిగిన కూరగాయల ధరలు
- ఆందోళనలో వినియోగదారులు

ప్రస్తుతం మార్కెట్లో ధరలు ఇలా కిలోకు..రూపాయల్లో..

కూరగాయలు	ప్రస్తుతం	10 రోజుల క్రితం
బీన్స్	120	100
చిక్కుడు	80	60
క్యాప్సికం	100	80
క్యారెట్	70	50
కాకర	60	40
బీట్‌రూట్	60	50
వంకాయలు	60	40
బీర	60	40
దొండ	60	40
మిర్చి	50	40
బెండ	50	40
కాలీఫ్లవర్	100	80
టమాటా	30	20



మార్కెట్‌లో విక్రయానికి ఉంచిన కూరగాయలు

ధరలు మండిపోతున్నాయి



ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయల ధరలు మండిపోతున్నాం. సామాన్యులుగా మంచి కూరగాయల కొనలేకపోతున్నాం. ధరలను ప్రభుత్వం నియంత్రించకుంటే ఎలా? తోట కూర సైతం చిన్న కట్ట రూ.20 అమ్ముతున్నారు. రెండు అరటి కాయలు 20 రూపాయలు పలుకుతున్నాయి. కార్తీక మాసంలో కంటే ధరలు ఆకాశాన్ని అంటడం బాధకరం. అధికారులు సమీక్ష చేపట్టి ధరలు నియంత్రించాలి.

– డి.మహలక్ష్మి, గృహిణి, వజ్రపుకొత్తూరు

రైతు బజార్లు ఏర్పాటు చేయాలి



కాశీబుగ్గ, పూండి, హరిపురంలో రైతు బజార్లు ఏర్పాటు చేయాలి. ఉద్దానం ప్రాంతంలో పండించే కూరగాయలను రైతు బజార్లలో విక్రయాలు జరిగేలా చూడాలి. రైతులకు మద్దతుధరతో పాటు వినియోగదారులకు సరసమైన ధరలకు కూరగాయలు లభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం పూండి, కాశీబుగ్గ మార్కెట్‌లలో కూరగాయలు కొనలేకపోతున్నాం. కిలో బెండకాయులు రూ.50, ఆగాకర కాయలు రూ.280 చెబుతున్నారు. కొనేందుకు ధైర్యం చేయలేకపోతున్నాం.

– ఎం.అనసూయమ్మ, వినియోగదారు, పూండి

వజ్రపుకొత్తూరు: కూరగాయల ధరలు కొండెక్కాయి. రూ.100 నోటు తీసుకుని మార్కెట్‌కు వెళితే కనీసం రెండు రోజులకు సరిపడా కూరగాయలు కూడా రావడం లేదని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ సక్రమంగా వానలు కురవకపోవడంతో కూరగాయల సాగు ప్రారంభం కాలేదు. దీంతో మిర్చి, క్యారెట్, బీట్ రూట్, బీన్స్, క్యాబేజీ, క్యాప్సికమ్ తదితర కూరగాయలను కోటబొమ్మాళి మండలం శ్రీపురం, పర్లాకిమిడి ప్రాంతాల నుంచి ఇక్కడ మార్కెట్‌కు దిగుమతి అవుతుండడంతో ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. పది రోజులు వ్యవధిలో కూరగాయల ధరలు అనూహ్యంగా పెరిగిపోయాయి.

ఏర్పాటు కాని రైతుబజార్లు..

కాశీబుగ్గ, టెక్కలి, పూండి ప్రాంతాల్లో రైతు బజార్లు లేకపోవడంతో వ్యాపారులు చెప్పిన ధరలకే వినియోగదారులు కొనాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఆయా ప్రాంతాల్లో రైతు బజార్లు ఏర్పాటు చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైంది. రైతు బజార్లు ఏర్పాటు చేసినట్లైతే రైతులు నేరుగా మార్కెట్‌కు తీసుకువచ్చి ఆశించిన లాభంతో వినియోగదారులకు కూరగాయలు అమ్ముకునేందుకు వీలుంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో వ్యాపారులు చెప్పిందే ఇష్టారాజ్యంగా మారింది. కూరగాయల ధరలు ఇంకా పెరిగే అవకాశం ఉందని హోల్ సేల్ వ్యాపారులు అంచనా వేస్తున్నారు. ఉద్దానంలో స్థానికంగా పండే బీర, కాకర, సొర, బెండ కాయలు ఆగస్టు నెలాఖరు నాటికి మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంది. అప్పటి వరకు ధరలపై నియంత్రణ ఉండేలా రెవెన్యూ, మార్కెటింగ్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని..లేదంటే తాత్కాలికంగానైనా రైతు బజార్లు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

'సుపరిపాలన తొలిఅడుగు'లో సమస్యలు ఏకరవు

- కొన్ని కుటుంబాలనే కలిసిన ఎమ్మెల్యే



ఎమ్మెల్యే అశోక్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న స్థానికులు

కంచిలి: కూటమి ప్రభుత్వం ఆర్భాటంగా చేపడుతున్న సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం కంచిలి మండలం గోకర్ణపురం పంచాయతీలో ఆదివారం తూతూ మంత్రంగా సాగింది. పంచాయతీ పరిధిలో గోకర్ణపురంతోపాటు జె.నారాయణపురం, ఉప్పరిపేట గ్రామాలుండగా కేవలం జె.నారాయణపురం గ్రామానికే కార్యక్రమం పరిమితమయ్యింది. ఇంటింటికీ ఎమ్మెల్యే వస్తే సమస్యలు వివరిద్దామని ప్రజలు వేచి ఉన్నప్పటికీ, ఎమ్మెల్యే బెందాళం అశోక్ మాత్రం కొన్ని కుటుంబాలనే కలిశారు. గ్రామానికి చెందిన దివ్యాంగుడు కొల్లాన లోకేశ్ వీల్ చైర్‌లో వచ్చి ఎమ్మెల్యే అశోక్‌ను పలకరించి.. తనకు వికలాంగ పింఛన్ రావడంలేదని వాపోయాడు. చాలాసార్లు దరఖాస్తు చేసినా రాలేదని చెప్పడంతో ఎమ్మెల్యే అతన్ని సముదాయించి గ్రామంలోకి వెళ్లిపోయారు. ప్రధాన వీధిలో ఊరేగింపుగా వెళుతూ కొన్ని కుటుంబాలనే కలిసి కార్యక్రమం ఉద్దేశాన్ని చెప్పగా.. చాలామంది తమకు పింఛన్లు రాలేదని, గ్రామంలో పలు సమస్యలు ఉన్నాయని ఏకరవు పెట్టడం కనిపించింది. గ్రామం చివర్లోని మండపం మీద సమావేశాన్ని నిర్వహించడంతో అక్కడ కూడా గ్రామస్తులు పలువురు తమ సమస్యలు చెప్పుకున్నారు. గ్రామానికి చెందిన ఇందిర ఎస్‌హెచ్‌జీ సభ్యులు తీసుకున్న రూ. 3.60 లక్షల బ్యాంకు లింకేజీ రుణాన్ని స్థానిక సీఏకు చెల్లించినప్పటికీ.. ఆ మొత్తాన్ని ఆమె బ్యాంకులో జమ చేయలేదని, దీంతో ఆ రుణం వడ్డీలతో తమ సంఘం పేరునే అప్పు చూపిస్తోందని సభ్యులు లొట్ల భాగ్యం తదితరులు ఎమ్మెల్యేకు చెబుతూ వాపోయారు. లొట్ల పార్వతి, లొట్ల లక్ష్మిల భర్తలు ఏడాదిన్నర క్రితం వేర్వేరు ప్రమాదాల్లో మృతిచెందారని, తాము పలుసార్లు దరఖాస్తు చేసినా వితంతు పింఛను మంజూరు చేయలేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వృద్ధాప్య పింఛన్ తీసుకుంటున్న తన భర్త అప్పన్న 15 నెలల క్రితం మృతి చెందినప్పటికీ.. ఆ పింఛన్‌ను తనకు ఇప్పటికీ మంజూరు చేయలేదని కాళ్ల ముత్యాలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లింది. గ్రామానికి చెందిన పలువురు కొండ పోరంబోకులో పోడు వ్యవసాయం చేసుకొని జీవిస్తున్నారని, వారికి పట్టాలు ఇవ్వాలని కోరారు. పాటిగుండాం చెరువుకు పైడిగాం చానల్ నుంచి వచ్చే కాలువను పలువురు ఆక్రమించారని, ఆక్రమణలు తొలగించాలని టీడీపీ నాయకుడు కర్రి కోదండరావు ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఎమ్మెల్యే అశోక్ ప్రసంగంలో మాత్రం ఈ పంచాయతీ మీదుగా ఆర్టీసీ బస్సు మంజూరు చేసే విషయం చెప్పి, మిగతా అభివృద్ధి ఏదీ చెప్పుకోదగింది లేకపోవడంతో పంచాయతీ అభివృద్ధికి స్థానిక పంచాయతీ సర్పంచ్ సహకరించడం లేదని దుయ్యబట్టారు. జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి దాసరి రాజు, మండల టీడీపీ అధ్యక్షుడు మాదిన రామారావు, మండల పార్టీ కార్యదర్శి పైల రామారావు, ఏఎంసీ మాజీ అధ్యక్షుడు బంగారు కురయ్య ఉన్నారు.

బాబూ జగ్జీవన్‌రాంకు ఘనంగా నివాళి



కవిటి: బాబూ జగ్జీవన్‌రాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు



కాశీబుగ్గలో బాబూజగజ్జీవన్ విగ్రహానికి అర్పిస్తున్న నివాళిలు

కవిటి: భారత పార్లమెంట్ చరిత్రలో తనకంటూ ఓ ప్రత్యేక శైలిని ఆపాదించుకున్న భారత ఉపప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్‌రాం లెజండరీ పార్లమెంటేరియన్‌గా నిలుస్తారని వక్తలు అన్నారు. ఆదివారం జగ్జీవన్ రాం వర్ధంతి సందర్భంగా కవిటిలో బాబూ జగ్జీవన్‌రాం, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటాలకు మాజీస్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు,న ర్తు రామారావు, మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. స్వాతంత్ర్య సమరయోధునిగా, సంఘసంస్కర్తగా, ఉత్తమ పార్లమెంటేరియన్‌గా జగ్జీవన్ రాం విశిష్టమైన సేవలు అందించారని కొనియాడారు. ఎంపీపీలు నిమ్మన దాస్, దేవదాస్‌రెడ్డి, బోర పుష్ప, పద్మ ప్రకాష్, శ్యాంప్రసాద్‌రెడ్డి, మండలపార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

☛ కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ సంత మైదానంలో ఉన్న డాక్టర్ బాబూ జగజ్జీవన్‌రాం విగ్రహానికి పలువురు సామాజిక కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాదిగకుల సంఘ అధ్యక్షులు ఉర్నాన అప్పలరాజు, నాయకులు కోల సింహాచలం, ఈశ్వరరావు, సోద భీమరాజు, కొత్తపల్లి రాము ఉన్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



సమ్మెకు మద్దతు తెలుపుతూ నినాదాలు చేస్తున్న కార్మిక సంఘం ప్రతినిధులు

పలాస: వివిధ ప్రజా సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో దేశవ్యాప్తంగా ఈ నెల తొమ్మిదో తేదీన చేపట్టనున్న సార్వత్రిక సమ్మెను స్థానికంగా విజయవంతం చేయాలని ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా శాఖ పిలుపునిచ్చింది. ఈ మేరకు బొడ్డపాడు అమరవీరుల స్మారక మందిరం వద్ద ఆదివారం సమ్మెకు మద్దతు తెలుపుతూ నినాదాలు చేశారు. నాలుగు లేబరు కోడ్‌లను రద్దు చేయాలని, ఎనిమిది గంటల పనిదినాలను కొనసాగించాలని, అవుట్ సోర్సింగ్ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనాన్ని రూ. 26 వేలుగా ప్రకటించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పారిశ్రామిక ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కార్యదర్శి పుచ్చ దుర్యోధన, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.కొండారెడ్డి, జిల్లా అధ్యక్షుడు మద్దిల ధర్మారావు, డి.నారాయణమూర్తి, కె.పురుషోత్తం, మామిడి గణపతి, గర్తం కూర్మారావు, యంపల్ల జోగారావు, గూడ మన్మథ పాల్గొన్నారు.

ఎన్‌పీ టెల్ పోటీల్లో ఆదిత్య కళాశాల ప్రతిభ

టెక్కలి: ఇటీవల ఐఐటీ చెన్నైలో నిర్వహించిన జాతీయ స్థాయి సాంకేతిక పరిజ్ఞాన పరీక్షలో టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల ప్రతిభ సాధించింది. ఈ విషయాన్ని కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు ఆదివారం తెలిపారు. దేశ వ్యాప్తంగా సుమారు 3,712 ఇంజినీరింగ్ కళాశాలలు హాజరు కాగా వాటిలో ఆదిత్య కళాశాల అత్యంత ప్రతిభ కనబరిచినట్లు పేర్కొన్నారు.

మైనర్ డ్రైవింగ్‌పై దృష్టిసారించాలని వినతి



ఎస్సై ముకుందరావుకి వినతి పత్రం అందజేస్తున్న అలయన్స్ క్లబ్ సభ్యులు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం పట్టణంలో ఇటీవల పెరిగిపోతున్న మైనర్ డ్రైవింగ్ నివారణపై పోలీస్ సిబ్బంది ప్రత్యేక దృష్టిసారించాలని స్థానిక స్వచ్ఛందసంస్థ అలయన్స్ క్లబ్ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు పట్టణ ఎస్సై ముకుందరావుకి ఆదివారం వినతిపత్రాన్ని అందజేశారు. పెరిగిపోతున్న మైనర్‌డ్రైవింగ్, ట్రాఫిక్‌సమస్య, ఈవ్‌టీజింగ్, మితిమీరిన వేగంతో ద్విచక్ర వాహనాలు నడపడం వంటివి విషయాలను పోలీస్ దృష్టికి తీసుకెళ్లారు. ఎస్సైని కలిసిన వారిలో క్లబ్ అధ్యక్షులు ఎల్.నరసింహమూర్తి, ఉపాధ్యక్షులు ఉమాశంకర్, సభ్యులు బుజ్జి, యోగి, వెంకట్, రఘు, బాల, బబులా, గోపీ, నరసింహమూర్తి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో ఏకాదశి పూజలు



కంచిలిలో జగన్నాథుడ్ని దర్శించుకుంటున్న భక్తులు

తొలి ఏకాదశి పూజలను భక్తులు ఆదివారం భక్తిశ్రద్ధలతో చేశారు. తెల్లవారుజాము నుంచే వివిధ ఆలయాలకు వెళ్లి పూజలు చేసి.. నైవేద్యాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. భక్తులకు ఇబ్బంది లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. – సాక్షి నెట్‌వర్క్

ఘనంగా కృష్ణదాస్ జన్మదిన వేడుకలు



కృష్ణదాస్‌కు కేక్ తినిపిస్తున్న సీతారాం

కవిటి: మాజీ ఉప ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ జన్మదిన వేడుకలను ఆదివారం కవిటిలో ముందస్తుగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, ఎమ్మెల్సీలు కుంభా రవిబాబు, నర్తు రామారావు, సాయిరాజ్‌లు కృష్ణదాస్‌కు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు.

రైల్వేస్టేషన్‌కు పోవాలంటే ఇది దాటాల్సిందే..



ఉద్దానం ప్రాంతం నుంచి రాకపోకలు చేసే ప్రయాణికులు పలాస రైల్వేస్టేషన్‌కు చేరుకోవాలంటే ఈ చిన్నపాటి వరద కాలువను తలపించేలా ఉన్న రోడ్డును దాటి వెళ్లాల్సిన పరిస్థితి దాపరించింది. తరచుపడుతున్న రైల్వే గేటుకు బయపడి ఈ ప్రాంతీయులు తాళ్లభద్ర గ్రామం మీదుగా వెనుక వైపు నుంచి రైల్వేస్టేషన్ చేరుకుంటుంటారు. అయితే అక్కడ సరైన రోడ్డులేక ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపల్ అధికారులు, నాయకులు స్పందించి ఈ రోడ్డును మరమ్మత్తులు చేపట్టాలని వారంతా కోరుతున్నారు. – కాశీబుగ్గ

ఆర్థికసాయం అందజేత



వజ్రపుకొత్తూరు మండలం అమలపాడు గ్రామానికి చెందిన డి.కె.అప్పారావు బతుకు తెరువు కోసం చెన్నై వెళ్తుండగా మార్గమధ్యలో రైలు ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయాడు. కుటుంబ పెద్దదిక్కు ఆకస్మిక మృతితో అతని కుటుంబం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటుంది. ఈ విషయం తెలుసుకున్న పూండికి చెందిన యువతరం సేవా సమితి ఆండగా నిలిచింది. రూ. 20 వేలు సేకరించింది. ఈ మొత్తాన్ని చెక్కు రూపంలో మృతుని భార్య డీకే సధ్యకు ఆదివారం అందజేసి ఆదర్శంగా నిలిచారు. కార్యక్రమంలో యువతరం సేవా సమితి వ్యవస్థాపకుడు చింత మురళి, ప్రతినిధులు జి.సునీల్, ఎ.లక్ష్మణరావు, ఎస్.లోకేష్, గున్న వెంకటరమణ, పుష్ప, రవి, దున్న పెంటారావు, వీరస్వామి, రాజు, లక్ష్మణ్ ఉన్నారు. – వజ్రపుకొత్తూరు

చేపల పెంపకం పరిశీలన



మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్ కుమార్ అన్నారు. మూలపొలం గ్రామంలోని జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న చేపల పెంపకాన్ని ఆదివారం పరిశీలించారు. అనంతరం గ్రామంలోని స్వయంశక్తి సంఘ మహిళలతో మాట్లాడి చేపట్టబోయే కార్యక్రమాలు, వార్షిక రుణ జీవనోపాధులు, ప్రణాళికల తయారీ విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. డీపీఏ పి.రవికుమార్, ఏపీఎం ప్రసాదరావు, అక్వా సిబ్బంది పాల్గొన్నారు. – సోంపేట

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ



అవగాహన ర్యాలీలో శక్తి టీం పోలీసులు, గ్రామస్తులు

వజ్రపుకొత్తూరు: శక్తి యాప్ మహిళలకు రక్షణగా ఉంటుందని శక్తి టీం కాశీబుగ్గ సబ్ డివిజన్ ఎస్ఐ ఎం. రవికుమార్ అన్నారు. ప్రతీ మహిళ తమ సెల్‌ఫోన్‌లో శక్తి యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. పెద్దమురహరిపురం గ్రామంలో శక్తి యాప్ వినియోగం, పని చేసే విధానంపై ఆదివారం అవగాహన కార్యక్రమం చేపట్టారు. మాదక ద్రవ్యాలు, నాటు సారా, గంజాయి, మద్యం వినియోగం వల్ల కలిగే నష్టాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలపై 1930, గ్రామాల్లో తగాదాలు, అసాంఘీక కార్యకలాపాలు జరిగితే 112 నంబర్లకు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. అనంతరంగా శక్తి యాప్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శక్తి టీం ఏఎస్ఐ బైరాగి, సిబ్బంది సప్తగిరి, గ్రామ మాజీ సర్పంచ్ కళిశెట్టి గోపాల్, ఎంపీటీసీ సభ్యుడు జి.వసంతరావు, గర్తం దానేసు పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్ ముఖర్జీకి ఘన నివాళులు



టెక్కలి: శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ కార్యకర్తలు



కాశీబుగ్గ: శ్యాంప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహిళలు

టెక్కలి: భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు, జాతీయ వాది శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ ఆశయాలను కొనసాగించాలని బీజేపీ కార్యకర్తలు ఆకాంక్షించారు. టెక్కలిలో శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మోదీ సుపరిపాలనపై గ్రామాల్లో ప్రచారం చేయాలని కోరారు. కార్యక్రమంలో యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు బి.నరేంద్రచక్రవర్తి, నాయకులు జె.రామ్‌జీ, జె.పరమేశ్వర్, ఎస్.లక్ష్మీనారాయణ, పి.రాము, అనిల్ పాల్గొన్నారు.

☛ కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ గాయత్రినగర్‌లో శ్యాంప్రసాద్ ముఖర్జీ జయంతి కార్యక్రమాన్ని బీజేపీ శ్రేణులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు పాలవలస మోహిణి, కణితి సుమిత్ర, కణితి శారిధి, పావని, రట్టి అనుసూయ, వల్లభ విజయలక్ష్మి, సంధ్య, తామాడ వనిత, కామేశ్వరి, పాట్నూరు తారకేశ్వరరావు ఉన్నారు.

జంతువుల నుంచి వ్యాపించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



టెక్కలిలో కుక్కలకు టీకాలు వేస్తున్న దృశ్యం

టెక్కలి: జంతువుల నుంచి వ్యాపించే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ పశువైద్యుడు బి.లక్ష్మణరావు సూచించారు. ఆదివారం ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా టెక్కలిలో 143 పెంపుడు కుక్కలకు రేబీస్ వ్యాక్సిన్లు వేశారు. పశు సంవర్ధక శాఖ డీడీ నర్సింహులు, ఏడీ బి.వెంకటరమణ పాల్గొన్నారు.

పెంపుడు జంతువులకు టీకాలు తప్పనిసరి



మందసలో కుక్కలకు టీకా వేస్తున్న డాక్టర్ శ్రీకాంత్

మందస: పెంపుడు జంతువులకు తప్పనిసరిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పశువైద్యాధికారులు సూచించారు. జూనోసిస్ దినోత్సవం సందర్భంగా మందస, హరిపురం పశువైద్యులు డాక్టర్ దువ్వాడ శ్రీకాంత్, కిల్లి ఉమాభారతి ఆధ్వర్యంలో మందసలో పెంపుడు జంతువులకు యాంటీ రేబిస్ టీకాలను వేశారు. సిబ్బంది ప్రసన్న, అనూష, బాలకృష్ణ, రాజ్యలక్ష్మి, తిరుపతి, పురోషోత్తం, మురళి ఉన్నారు.